856) లలిత / మోహన

ప॥ విష్ణు దేవు పాదములే విద్యబుద్ధీ మాకు ।వైష్ణవులమైతి మింక వదలవో కర్మమా ॥

చ॥ గోవిందునిపాదములే కోరి యిహపరములు ।శ్రీవిభునిపాదములే చేరువేదశాస్త్రములు ।
దేవదేవుపాదములే దిక్కును దెసయు మాకు ।భావములో నిలిపితి పాయరో పాపములు ॥

చ॥ హరిపాదములే మాకు నన్నపానభోగములు ।పరమాత్ము పాదములే పాడీ పంటా మాకు ।
మురహరు పాదములే ముందర వెనకా మాకు ।శరణంటి మెందైనా చనరో దుఃఖములు ॥

చ॥ అనంతుని పాదములే ఆయుష్య భవిష్యములు ।దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు ।
యెనలేని శ్రీవేంకటేశు డితనిపాదాలే ।మనసున గొలిచితి మానరో భవములు ॥